ఏటా నష్టాలే!

- ఈ ఏడాది దిగుబడి అంతంత మాత్రమే
- మ్యాంగ్ బోర్డు ఏర్పాటు ఇప్పట్లో లేనట్లే..
- మామిడి రైతులకు తప్పని ఇక్కట్లు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఏటా మామిడి రైతుకు నష్టాలే ఎదురవుతున్నాయి. ఈ ఏడాది కూడా దిగుబడి 50 శాతం లోపే ఉంటుందని ఉద్యానవనశాఖ అంచనా వేస్తోంది. జిల్లాలో 1.7 వేల ఎకరాల్లో మామిడి సాగు అవుతోంది. ఇందులో ముఖ్యంగా తోతాపురిదే అగ్రభాగం. దాదాపు 85 నుండి 90 శాతం తోతాపురి రకం సాగు చేస్తున్నారు. వాణిజ్య పంట కావడంతో మామిడి రైతులు తోతాపురి రకం సాగుపై ఆసక్తి చూపడంతో చిత్తూరు జిల్లాలో ఈ రకం ఎక్కువగా సాగులో వుంది. ఈ ఏడాది మామిడి సీజన్ ప్రారంభంలో పూత బాగా ఉండటంతో సాగు దిగుబడి పెరుగుతుందని ఆశించినా..50 శాతం మించి పంట వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. మ్యాంగ్ బోర్డు ఏర్పాటుపై ఆశలు పెట్టుకున్న మామిడి రైతులకు ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో మ్యాంగో బోర్డు ఏర్పాటుకు నిధులు కేటాయించక పోవడంతో మ్యాంగోబోర్డు ఏర్పాటు కలగానే మిగిలింది.

ఏటా నష్టాలే..

ప్రతి ఏటా మామిడి రైతులు నష్టపోతున్నారు. పండ్ల పరిశ్రమల యజమానులు సిండికేట్ కావడం ధరలను అదుపు చేయడంతో తోతాపురి రకానికి మద్దతు ధర లభించడం లేదు. 2021లో తొతాపురి రకం కిలో రూ.5లకు పడి పోవడంతో చిత్తూరు జిల్లాలోని మామిడి రైతుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. కలెక్టరేట్ ఎదుట వేలూరు– చిత్తూరు జాతీయ రహదారిపై రోడ్డుపైనే ఏడాది పాటు కష్టపడి పండించిన మామిడి నేలపై పోసి నిరసన వ్యక్తం చేశారు. నాటి టిడిపి ప్రభుత్వం మామిడి రైతులను ప్రోత్సహించేలా కిలోకు రూ.7.50 ధర అందించాలని నిర్ణయించింది. మళ్లీ అదే పరిస్థితి ఏర్పడే ప్రమాదం వుందని మామిడి రైతులు అంటున్నారు. గత ఏడాది మొదట్లో తోతాపురం రకం టన్ను రూ.15 వేలు నుంచి 10 వేల రూపాయలు వరకు అమ్ముడు పోయిందని ఈ ఏడాది ఆదే పరిస్థితి వుంటే మామిడి రైతు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందంటున్నారు.

ఆగిన పల్ప్ ఎగుమతులు

గత ఏడాది జిల్లాలోని పండ్ల గుజ్జు పరిశ్రమలో పల్ప్ ఎగుమతులు గల్ఫ్ యుద్ధాల ప్రభావంతో ఆగి పోవడంతో చిత్తూరు జిల్లాలో 40 శాతం పల్ప్ ఎగుమతులకు నోచుకోలేదు. దీని ప్రభావం ఈ ఏడాది తొతాపురి రకం కొనుగోలుపై పడే అవకాశం వుందని పండ్ల పరిశ్రమల యజమానులంటున్నారు. పల్ప్ నిలువలు పేరుకు పోడంతో జిల్లాలోని కొందరు పండ్ల పరిశ్రమల యజమానులు ప్రొడక్షన్ ఖర్చు కంటే తక్కువ ధరకు ఎగుమతి చేసినట్లు చెబుతున్నారు. కొందరు ఎగుమతి చేయలేక పరిశ్రమల్లోనే పల్ప్‌ను ఉంచారని ఇలా నిల్వ ఉంచిన గుజ్జు పరిశ్రమలు ఈ ఏడాది మామిడి కొనుగోలు చేసి గుజ్జు చేసే అవకాశం లేదంటున్నారు. ఎగుమతుల విషయంలో గుజ్జు పరిశ్రమల యజమానులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేకుండా పోయిందంటున్నారు.

ఈ ఏడాది భారీ నష్టం తప్పేలా లేదు..

గత ఏడాది మామిడి దిగుబడి తగ్గినా తోతాపురి రకం టన్ను రూ.15 వేల నుండి రూ.12 వేల వరకు అమ్ముడు పోయింది. ఈ ఏడాది దిగుబడి అంతంత మాత్రంగానే వుంది. ఈ పరిస్థితుల్లోనూ టన్ను రూ.10 వేల నుండి 11 వేలకు మించి అమ్ముడుపోయే పరిస్థితి లేదని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యానశాఖ అంచనా కూడా ఇలాగే వుంది. కనీసం సాగు ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదంటున్నారు. ఈ రకం మామిడి సాగు కోసం 20 నుంచి 25 వేలు ఖర్చు చేయాల్సి వస్తోందని ఎకరాకు మూడు టన్నులొచ్చినా రూ. 30 వేలకు మించి వచ్చే పరిస్థితి లేదంటున్నారు. ప్రభుత్వం మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు మామిడికి మద్దతు ధర నిర్ణయించాలని రైతు సంఘాలు, మామిడి రైతులు కోరుతున్నారు.

2021లో కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై మామిడి కాయలు పారబోసి నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నేతలు, మామిడి రైతులు (ఫైల్ ఫొటో)

మ్యాంగో బోర్డు ఇప్పట్లో లేన్నట్లే

మ్యాంగో బోర్డు ఏర్పాటు విషయంలో చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళప్రసాద్‌రావు పార్లమెంట్‌లో ప్రస్తావించారు. చిత్తూరు మామిడి రైతులను ఆదుకోవడంతో పాటు ఎగుమతులు లేక ఆగిపోయిన మామిడి గుజ్జు ఎగుమతుల విషయాన్ని పార్లమెంట్ దృష్టికి తీసుకొచ్చారు. మ్యాంగో బోర్డు ఏర్పాటు ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రస్తావనే లేదు. బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే తప్ప మ్యాంగో బోర్డు ఏర్పాటు ప్రశ్నర్థకమే..మ్యాంగో బోర్డు ఏర్పాటు అలస్యం, మామిడి గుజ్జు పరిశ్రమల సిండికేట్, పల్ప్ ఎగుమతులు ఆగిపోవడం ఇలా కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలన్నట్లుగా మామిడి రైతుల నడ్డివిరుస్తున్నాయి.

నగర వనం పేరుతో ఎర్రచందనం మాయం!

- వేర్లు వున్నాయి.. చెట్టు ఏమైంది
- కంచే చేను మేస్తుందా..?

ప్రజాశక్తి -కార్వేటినగరం: కేంద్ర ప్రభుత్వం పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు జిల్లాలో పలు చోట్ల ఆటవీ ప్రాంతాలను నగర వనాలుగా తీర్చిదిద్దారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, నిర్మాణాలు చేపట్టేందుకు అటవీశాఖ అధికారులకు అప్పగించింది. ఇందులో భాగంగా కార్వేటినగరం నుంచి చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై ఉన్న కుప్పానిగుంట వద్ద గత సుమారు 60 సంవత్సరాల క్రితం ఎర్రచందనం ప్లాంటేషన్ చేపట్టింది. ఏపుగా పెరిగిన కోట్ల విలువ చేసే ఎర్రచందనం చెట్ల మధ్య జాతీయ రహదారిని ఆనుకుని పుత్తూరు–కార్వేటినగరం పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంటున్న మంచి వాతావరణంతో కూడుకున్న ఈ ప్రాంతంలో రూ. కోటీ 10 లక్షలతో నగరవనం నిర్మాణం చేశారు. అయితే నగర వనం నిర్మాణానికి కేటాయించిన స్థలంలో ఉన్న ఎర్రచందనం వృక్షాలు మాయమైనట్లు పర్యాటకులు విమర్శిస్తున్నారు.

అటవీ అధికారి వివరణ

ఎర్రచందనం చెట్లు మాయంపై కార్వేటినగరం ఆటవీశాఖ అధికారిని వివరణ కోరగా అక్కడ ఎలాంటి ఎర్రచందనం చెట్లే లేదని చెప్పడంపై స్థానికులు అవాక్కు అవుతున్నారు. మొక్కలే లేనప్పుడూ ఈ వేర్లు ఇక్కడికి ఎలా వచ్చిందనే ప్రశ్న అక్కడి వారికి ఎదురైయింది. ఆటవీశాఖ అధికారి చెప్పిన సమాధానానికి ఎలాంటి పొంతన లేకపోవడంతో కంచే చేను మేస్తే.. కాపరి ఎంచేయగలడనే చందంగా ఆటవీ శాఖ అధికారులు సమాధానం ఉందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై జిల్లా అధికారులు స్పందించి నగర వనం ప్రాంతాన్ని సందర్శించి నిజాలను నిగ్గు తేల్చాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు.

వేర్లు వున్నా మాయమైన ఎర్రచందనం చెట్టు

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

- బాలిక తల్లిదండ్రులపై దుర్భాష - నిందితుడి తల్లిదండ్రులపైనా కేసు

ప్రజాశక్తి-చౌడేపల్లి: బాలికను నమ్మించి గర్భవతిని చేసిన వ్యక్తిపై ఎస్‌సి, ఎస్‌టి పోక్సో కేసు నమోదు చేశామని, బాలిక తల్లిదండ్రులను దుర్భాషలాడిన నిందితుడి తల్లిదండ్రులపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేశామని చౌడేపల్లి ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం మేరకు.. చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలం ఆమినిగుంట పంచాయతీ నూనెముద్దలపల్లి గ్రామంలో సుమారు 15 సంవత్సరాలు వయసు కలిగిన బాలికను ప్రేమించానని పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి సుమారు గర్భవతిని చేశాడని, ప్రస్తుతం ఆ బాలికకి ఆరు నెలలు గర్భవతి అన్నారు. ఇందుకు కారకుడైన అదే గ్రామానికి చెందిన నాగేంద్రపై పోక్సో, ఎస్‌సి, ఎస్‌టి చట్టాల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. ఆ బాలిక తల్లిదండ్రులను కులం పేరుతో దూషించి గ్రామం వదిలి వెళ్లి పోవాలని బెదిరించాడని తెలిపారు. ఇందుకు కారణమైన నాగేంద్ర తల్లిదండ్రులు లక్ష్మన్న , విజయలక్ష్మిలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని తెలిపారు.

ఎంపీని ఆహ్వానిస్తున్న ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు

ఫెడరేషన్ మహాసభలకు ఎంపీకి ఆహ్వానం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ చిత్తూరు జిల్లా నాలుగో మహా సభకు రావాలని కోరు తూ ఎపిడబ్ల్యూజేఎఫ్ నాయకులు చిత్తూరు ఎంపి దగ్గు మళ్ళ ప్రసాద్ రావును మంగళ వారం ఆహ్వానిం చారు. ఈ కార్యక్రమంలో ఏపిజేడబ్ల్యూఎఫ్ నాయకులు జయప్రకాష్, కేశవులు, కృపానందరెడ్డి, బాలసుబ్రహ్మణ్యం, నాగరాజు, ఉమాశంకర్, మురళి పాల్గొన్నారు.

ఆశా వర్కర్లు ప్రతి ఇంటినీ సందర్శించాలి

జిల్లా టీబీ అధికారి వెంకటప్రసాద్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా టిబి అధికారి వెంకట ప్రసాద్

ప్రజాశక్తి-పూతలపట్టు: ఆశా వర్కర్లు ప్రతి ఇంటినీ సందర్శించి కుటుంబంలోని ప్రజల ఆరోగ్య స్థితి గతు లను ఎప్పటి కప్పుడు రికార్డు ల్లో తెలపాలని జిల్లా టిబి అధికారి వెంకట ప్రసాద్ సూచిం చారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆశా వర్కర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సికిల్ సెల్ , అనీమియా, బ్లడ్ స్క్రీనింగ్ టార్గెట్స్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. పిహెచ్‌సీ రికార్డులు పరిశీలించారు. 'ప్రపంచ ఓరల్ హెల్త్ అవేర్‌నెస్ వీక్'పై నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి ప్రియాంక, వెంకటేశ్వరరావు బిడియస్ డెంటిస్ట్, డాక్టర్ సంధ్య బిడియస్ డెంటిస్ట్, శ్రీనివాస్ మూర్తి, కమ్యూనిటీ పబ్లిక్ ఆరోగ్య అధికారులు పాల్గొన్నారు.

ఒంటిమిట్టకు ప్రత్యేక బస్సులు: డిఎం

ప్రజాశక్తి -పుంగనూరు: పుంగనూరు నుండి కడప జిల్లా ఒంటిమిట్ట సీతారామ కళ్యాణోత్సవానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11న సీతారామ కళ్యాణోత్సవాన్ని ఒంటిమిట్టలో నిర్వహిస్తున్న సందర్భంగా పుంగనూరు నుండి వెళ్లాల్సిన భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు చెప్పారు. పుంగనూరు డిపో నుండి మదనపల్లి, రాయచోటి, కడప మీదుగా ఒంటిమిట్ట చేరుతుందని చెప్పారు. మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి సాయంత్రం 6 గంటలకు ఒంటిమిట్టకు చేరుతుందన్నారు. రాత్రి 10 గంటలకు ఒంటిమిట్టలో బయలుదేరి మరుసటి దినం వేకువ జామున నాలుగు గంటలకు పుంగనూరు చేరుతుందన్నారు. రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. టికెట్టు ధర పెద్దలకు 550 రూపాయలు, పిల్లలకు 350 రూపాయలు ఉంటుం దన్నారు. అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

సిఎం సహాయ నిధి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం లు లబ్ధిదారులకు మంగళ వారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ పరిధిలోని అనిమిగానిపల్లి ప్రాంతానికి చెందిన గంగాధర్ అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం సహాయం అందించాలని ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. స్పందించిన ముఖ్యమంత్రి 1,21,329 రూపాయల చెక్కును మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి పాలకమండలి సభ్యులు శాంతారామ్, పట్టణ టిడిపి అధ్యక్షులు రాజ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు ప్రేమ్ కుమార్, టిడిపి నాయకులు కాణిపాకం వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు వినతుల స్వీకరణ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : చిత్తూరు ఎమ్మెల్యే కార్యాలయం లక్ష్మీ నగర్ కాలనీలోని ప్రజాదర్బార్‌లో బుధవారం 'ప్రజా ఫిర్యాదుల స్వీకరణ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మంగళవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు నియోజకవర్గ ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారు. మధ్యాహ్నం 'కార్యకర్తే అధినేత' కార్యక్రమంలో భాగంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారు.

పింఛన్ కోసం పోరాటం

- తిరిగితిరిగి అలసిపోయా..
- అమలు కాని ప్రభుత్వ హామీలు
- న్యాయం చేయాలని బాధితురాలు వినతి

ప్రజాశక్తి -వెదురుకుప్పం: భర్త చనిపోయి సంవత్సరం పైన అవుతోంది. అప్పటి నుంచి పింఛన్ కోసం ఆ మహిళ పోరాటం చేస్తోంది. తెలిసిన నాయకుల దగ్గరికి, కార్యాలయాల చుట్టూ తిరిగింది. ఫలితం లేదు. కూలికి పోతేనే జీవనం సాగుతోంది. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఎక్కడైనా భర్త చనిపోతే ఆ నెలలోనే పింఛన్ అందించాలని కూటమి ప్రభుత్వం పదేపదే హామీ ఇస్తోంది..అయితే ఇక్కడ పరిస్థితి భిన్నంగా వుంది. ప్రభుత్వ హామీలు అమలు కావడంలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గ పరిధిలో వెదురుకుప్పం మండలం నాందేడ్ దళిత వాడకు చెందిన రామ్మూర్తి 2024, జనవరి 24 న మృతి చెందాడు. ఆయన భార్య రోసమ్మ భర్త అంత్యక్రియ కార్యక్రమాలు పూర్తిచేసుకుంది. తర్వాత కావలసిన పత్రాలతో అన్ని ఆఫీసులలో తిరిగితిరిగి ఆలసిపోయింది. అప్పటి నుంచి రోశమ్మ తెలిసిన కూటమి నాయకుల చుట్టూ తిరిగింది. ఆఫీసుల చుట్టూ అర్జీల రూపంలో ఇచ్చి వారి చుట్టూ ప్రదక్షిణలు చేసింది. అయినా ఫలితం లేదు. భర్త చనిపోయి ఏడాదిపైనే అవుతుంది. ఇంతవరకు ఆ మహిళకు పింఛను అందలేదు. ఏమి చేయాలో ఆమెకు తెలియదు. కూలీ పనులకు వెళుతూ జీవనం సాగిస్తుంది. న్యాయం చేయాలని కోరుకుంటోంది.

అడిగి అడిగి అలిసిపోయా..

మా ఊరి ఆఫీసులో తెలిసిన వారి దగ్గరకు పింఛను కావాలని తిరిగాను. న్యాయం జరగలేదు. న్యాయం చేయండి.. పింఛను ఇప్పించండి...

- రోసమ్మ, మాంబేడు దళితవాడ, వెదురు కుప్పం మండలం.

విభిన్న ప్రతిభావంతుల చట్టాలు అమలు చేయాలి: డిఆర్ఓ

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్ : విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం రూపొందించిన చట్టాలను ఖచ్చితంగా అమలు చేయాలని డిఆర్ఓ కె మోహన్ కుమార్ ఆదేశించారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని డిఆర్ఓ ఛాంబర్‌లోని సమావేశ మందిరంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి చేపట్టాల్సిన అంశాలపై వివిధ శాఖల అధికారులతో డిఆర్ఓ జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలతో విభిన్న ప్రతిభావంతుల అభివృద్ధి, సంక్షేమానికి జిల్లా స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యకమానికి విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ప్రభుత్వం విభిన్న ప్రతిభా వంతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని గతంలో ఉన్న చట్టాలను సవరించి 2016 సంవత్సరంలో కొత్తగా చట్టాన్ని రూపొందించా రన్నారు. ఈ చట్టాన్ని అనుసరిస్తూ వివిధ శాఖల ద్వారా విభిన్న ప్రతిభా వంతుల అభివృద్ధి, సంక్షేమం కోసం అమలు చేయాల్సిన కార్యక్రమాలకు కార్యాచరణ తయారు చేసి అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రతిభా వంతుల సంక్షేమానికి చేపడుతున్న పథకా లను పటిష్టంగా అమలు చేయాలని సూచిం చారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయాలలో ర్యాంప్‌ల ఏర్పాటు, వీల్ చైర్‌లను అందుబాటులో ఉంచాలని, బస్, రైల్వే పాస్ సౌకర్యం కల్పించాలని, సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలని, కమ్యూనిటీ హాల్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, సంఘ నాయకులు డిఆర్ఓ ను కోరారు. ఈ సమావేశం లో జెడ్పి సిఈఓ రవికుమార్ నాయుడు, పిఆర్ఎస్ ఈ చంద్రశేఖర్ రెడ్డి, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టరు సుధారాణి, ఐసిడిఎస్ అధికారి వెంకటేశ్వరి, సమగ్ర శిక్ష ఏపిసి వెంకటరమణ, డిసిహెచ్ఎస్ డాక్టరు పద్మాంజలి దేవి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్, సంబంధిత అధికారులు, డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటీ మెంబర్లు మురళి, చంద్రశేఖర్, రామచంద్ర, విక్రమ్, జయరామయ్య, శివ, లీలపతి నాయుడు, లోకనాథం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఆర్‌వో కె మోహన్ కుమార్

మే 31 లోపు విజన్ 2047 ప్రణాళికలు సిద్ధం చేయండి

జిల్లా అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్ : స్వర్ణాంధ్ర -2047 విజన్‌లో భాగంగా జిల్లా సర్వతోముఖాభివృద్ధికి నియోజక వర్గాల వారీగా స్వల్ప, దీర్ఘ కాలిక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో 2024 నుండి 2028-29 వరకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ మంగళవారం నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో కలెక్టర్ జెసి జి విద్యాధరి, డిఎఫ్ఓ భరణిలతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు స్వర్ణాంధ్ర -2047 విజన్ సాధనకు చేపట్టాల్సిన అంశాలపై కార్యాచరణను ప్రకటించారని ఇందులో భాగంగా నియోజకవర్గ స్థాయిలో కార్యాచరణ ప్రణాళికలను నియోజకవర్గ ప్రత్యేక అధికారులు తయారు చేసి మే 31వ తేదీ లోపు సమర్పించాలని, కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయడంలో ప్రత్యేక అధికారులకు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది సహకారం అందించాలని ఆదేశించారు. నియోజక వర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలతో కూడిన డాక్యుమెంట్ ను తయారు చేసుకుని అందుకు అనుగుణంగా లక్ష్యాలను నిర్దేశించుకుని పని చేయాలన్నారు. విద్య, వైద్య, పారిశ్రా మిక, వ్యవసాయ, ఉద్యాన, నైపుణ్యాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, తదితర రంగాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసే సమయంలో మండల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని డాక్యుమెంట్ రూపంలో తయారు చేసి పంపాలని సూచించారు. కొన్ని నియోజకవర్గాలలో విద్యా రంగానికి సంబంధించి డిగ్రీ కళాశాలలు, కెజివిబి, పాఠశాలలో అదనపు గదుల ఏర్పాటు అవసరం వుందని, వైద్యరంగంలో వంద పడకల ఆసుపత్రుల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన, అంగన్‌వాడీ భవనాల మరమ్మతులు, అదనపు భవనాల నిర్మాణం, తాగునీటి ఏర్పాటు, పరిశ్రమల ఏర్పాటు, ఉద్యాన శాఖలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ, డ్రిప్‌ల మంజూరు, యువతకు ఉపాధి కల్పన లాంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలను తయారు చేయాలన్నారు. నియోజకవర్గ ప్రస్తుత పరిస్థితులు, అవసరమైన అంశాలను జిల్లా స్థాయిలో తయారు చేసిన ఫార్మెట్ లో వివరంగా పూరించి పంపాలన్నారు. స్వల్ప, దీర్ఘకాలిక ప్రణాళికలను తయారు చేసి పంపాలని, సాధ్యమైన మేరకు జిల్లా లక్ష్యాలను సాధించడానికి మంజూరు ఉత్తర్వులు ఇస్తారని, రాష్ట్ర స్థాయిలో పరిష్కరించే అంశాలను ఉన్నత అధికారులకు పంపుతామన్నారు. ఈ సమావేశానికి సిపిఓ సాంబశివా రెడ్డి, జెడ్‌పి సిఈఓ రవికుమార్ నాయుడు, పిఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ లు చంద్రశేఖర్ రెడ్డి, విజయ కుమార్, డిఆర్డిఏ, డ్వామా, హౌసింగ్, ఐసిడిఎస్ పీడీలు శ్రీదేవి, రవికుమార్, గోపాల్ నాయక్, వెంకటేశ్వరి, జిల్లా వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, పట్టుపరిశ్రమ శాఖల అధికారులు మురళీకృష్ణ, మధుసూదన్ రెడ్డి, ఆరిఫ్, శోభారాణి, డిఎంఅండ్‌హెచ్ ఓ డాక్టరు సుధారాణి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య, ఏపిఎంఐపి పీడీ బాలసుబ్రహ్మణ్యం, ఎల్‌డిఎం హరీష్ పాల్గొన్నారు.

జిల్లా అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

రేపు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -పెద్దపంజాణి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం చిత్తూరు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ డి ఆర్‌డి ఏ, చిత్తూరు తిరుపతి జిల్లాల గ్రామీణ అభివృద్ధి సంస్థ సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్ప్రైజ్ డెవలప్మెంట్ ఇన్ ఆంధ్ర ప్రదేశ్ సేడ్ ఏపీ వారు సంయుక్తంగా ఈ నెల 10వ తేదీ జాబ్ మేళాను నిర్వహిస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం మీరాబాయి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఏప్రిల్ 10వ తేదీ గురువారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు వెలుగు కార్యాలయంలో జాబ్ మేళా రిజిస్ట్రేషన్ క్యాంపు నిర్వహిస్తున్నారు. 18 నుండి 30 సంవత్సరాల లోపు నిరుద్యోగ యువతీ యువకులు వారి విద్యార్హతలు ఇతరత్రా ఆధారాలతో ధ్రువీకరణ పత్రాలతో హాజరై వారి వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఎంపికైన నిరుద్యోగ యువతీ యువకులకు తదుపరి ఉపాధి శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తారని యంపిడి ఓ బాలాజీ వెలుగు ఏపిఎం మీరాబాయి, జాబ్స్ కోఆర్డినేటర్ వినోద్ తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మరిన్ని వివరాలకు బి వినోద్ ,జాబ్స్ కోఆర్డినేటర్ 7672096930 నెంబరును సంప్రదించాలన్నారు.

కనుమరుగవుతున్న కుండల తయారీ

- బంకమట్టి కొనుగోలు చేయాల్సిన దుస్థితి
- కుండలు కాల్చడానికీ వాములు కరువు
- ప్రశ్నార్థకంగా తయారీ దారుల బతుకులు

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: ఒకప్పుడు వేసవి తాపాన్ని తీర్చే చల్లని నీటిని అందించే కుండలు, వంట తయారీకి ఉపయోగించే మట్టి పాత్రల తయారీ నేడు క్రమంగా అంతరించిపోతోంది. గంగాధర నెల్లూరు నియోజక వర్గంలో కుండల తయారీకి బంకమట్టి దొరక్క తయారీదారులు తీవ్ర ఇబ్బందులెదుర్కొం టున్నారు. వందల రూపాయల్లో డబ్బు వెచ్చించి బంక మట్టిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. కుండలు కాల్చడానికి వాడే వాములు కూడా నేడు కరువయ్యాయి. మరో పక్క తయారు చేసిన కుండలను మార్కెట్లో అమ్ముకోవడానికి తగిన గిట్టుబాటు ధర లేక, కొనుగోలు దారులు లేక తయారు చేయడం మానుకుంటున్నారు. దీంతో కుండల తయారీపై ఆధారపడిన వృత్తిదారులు కొందరు ప్రత్యామ్నాయ పనులు లేక జీవనం గడవక దుర్భరంగా మారి ప్రశ్నార్థకమైంది.

కనుమరుగవుతున్న కుండల తయారీ

గంగాధర నెల్లూరు నియోజకవర్గ పరిధిలో సుమారు కుమ్మర వృత్తి దారులు సుమారు 80 గ్రామాల్లో ఉండగా అందులో 20 గ్రామాలలో కొంత మంది మాత్రమే కుండలు తయారు చేస్తున్నారు. వీళ్లు బంక మన్ను దొరక్క అవస్థలు పడుతున్నారు. కుండలు తయారీదారులు కూడా ఈ వృత్తిని చేయడానికి అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ వృత్తిదారులు ఈ వృత్తిని నిలిపేసి ఉపాధి హామీ పనికి, ఇతర ఇతర పనులకు వెళు తున్నారు. ఈ గ్రామాలలో ఉండే కొంత మంది మట్టి వినాయక బొమ్మలు తయారు చేస్తున్నారు. మరి కొంతమంది పక్క రాష్ట్రమైన తమిళనాడు నుంచి కుండలు తెచ్చుకొని అమ్ముకుంటున్నారు. ఒకప్పుడు ఎండాకాలం వస్తే కడవకు చాలా గిరాకీ ఉండేది. క్రమేణా ఫ్రిజ్‌లు రావడంతో కడవలు వాడకం తగ్గింది. ఈ కుండలు చావులకు , పెళ్లిళ్లకు ఖచ్చితంగా అవసరమని తెచ్చుకొని అమ్ముకుంటున్నారు.

బంకమట్టి కొనుగోలు చేయాల్సిన దుస్థితి

కుమ్మరి వృత్తి దారులు తయారుచేసే కుండలకు అవసరమైన బంకమట్టిని వందల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. గతంలో ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ కుమ్మరి కుల వృత్తిదారులకు కుండలు తయారు చేసుకోవడానికి ఐదు సెంట్లు భూమి కేటాయించి అక్కడ వాళ్ల కుండలు కాల్చడానికి, కుండలు తయారు చేసుకొని భద్రపరచుకోవడానికి ఒక గదిని ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇప్పుడు తయారీదారులు ఊరికి బయట కుండలు కాల్చుకుంటున్నారు. కుండలు కాల్చుకోవడానికి కూడా స్థలం లేక కొన్ని గ్రామాల్లో తయారీదారులు అవస్థ పడుతున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కుండలు తయారు చేసేవారు, నేర్చుకునే వారు కరువయ్యారు.

ప్రభుత్వ ప్రోత్సాహం కరువు

ప్రభుత్వ ప్రోత్సాహం లేక ఈ వృత్తి కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడిందని కొంత మంది కుల వృత్తి దారులు వాపోతున్నారు. ప్రభుత్వం ప్రోత్సహించి సహాయం అందించి, తయారీకి కొంత భూమిని కేటాయించాలని కోరుతున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో వాళ్ల కుండలు కాల్చుకోవడానికి కట్టెలు కూడా దొరక్కుండా అవస్థలు పడుతున్నారు. క్రమేణా ఇదే విధంగా ఉంటే ఈ కులవృత్తి ఆ కొంత మంది కూడా తయారు చేయని పరిస్థితి ఏర్పడుతుందని తయారీదారులు వాపోతున్నారు.

మట్టి పాత్రల వాడకం తగ్గింది

గతంలో ప్రతి ఒక్కరూ మట్టి పాత్రలు వాడేవారు. దీని వల్ల అప్పట్లో ఆరోగ్యంగా వుండేవారు. నేడు ఆధునిక యుగంలో స్టీల్ పాత్రలు రావడం వల్ల మట్టి పాత్రల వాడకం పూర్తిగా తగ్గింది. దీని వల్ల తయారు చేసేవారు తగ్గిపోయారు. మా పూర్వీకులు మట్టి పాత్రలు వాడుకోవడం వల్ల 110 సంవత్సరాలు బతికారు. ఒకప్పుడు ప్రతి ఇంట్లో ప్రతి వస్తువు మట్టి పాత్రలే ఉండేవి. 50 సంవత్సరాల క్రితం మా మామ, నా భర్త కుండలు తయారు చేసేవారు. వాళ్లు చనిపోయిన తర్వాత తయారు చేసేవారు కరువయ్యారు. ఎవరైనా అడిగితే నేను బయటి నుంచి తెచ్చుకొని అమ్ముకుంటున్నాను.

- గంగులమ్మ, తూగుండ్రం గ్రామం.

కుండల తయారీని నేర్చుకోలేదు..

నేను తాపీ మేస్త్రిగా పని చేస్తున్నాను మా గ్రామం తూగుండ్రం గ్రామం, నేను కుమ్మరి వృత్తి దారుడిని. నాకు కులవృత్తిపై ఆసక్తి ఉన్నా నాకు నేర్పించేవారు లేరు.. తాపీ మేస్త్రి పని నేర్చుకుని ఆ పనికి వెళుతున్నాను. ప్రభుత్వం కులవృత్తిని ప్రోత్సహించి ఏదైనా సహాయం అందించాలి. రాబోయే తరాల కైనా ఈ వృత్తిపై అవగాహన ఉండేలా వారికి ఈ వృత్తి నేర్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

- ఆముదాల గిరి, గంగాధర నెల్లూరు మండలం.

మట్టి తొట్టెలు, పాయ్యలు తయారు చేస్తా

మట్టిపొయ్యలు, మట్టితొట్టెలు తయారు తయారుచేస్తా ..అనారోగ్య కారణాల వల్ల ఆ పని చేయడం లేదు. రైతులు గ్రామాల్లో పశువులకు నీళ్ళ, మట్టితొట్టెలు దొరక్క పోవడంతో ప్లాస్టిక్ టబ్‌లలో ఆవులకు నీళ్ల పెడుతున్నారు. ప్రభుత్వం మా వృత్తి దారులకు ఏదైనా సహాయం చేసి కుల వృత్తిని రాబోయే తరాలకు ప్రోత్సహించే విధంగా చేయాలి..

- పి మునెమ్మ, పెనుమూరు మండలం.

మాజీ సర్పంచ్ కుమార్తె మిస్ గ్లోబల్

ప్రజాశక్తి -వెదురుకుప్పం: గంగాధర నెల్లూరు నియోజకవర్గం పరిధిలో వెదురు కుప్పం మండలం పాతగుంట టిడిపి సీనియర్

నాయకులు, మాజీ సర్పంచ్ గోపి కృష్ణా రెడ్డి కుమార్తె భావన గని మిస్ గ్లోబల్ ఏషియన్ 2025 విజేతగా నిలిచింది. తన సొంత గ్రామం పాతగుంటకు ఆమె మంగళవారం వచ్చారు. ఈ సందర్భంగా ఆమెను శాలువా కప్పి సన్మానించి ఘనంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా యువత వైస్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీటీసీ చంద్రబాబు రెడ్డి, యువనాయకులు లోకానాధ రెడ్డి, బిసి నాయకులు తిమ్మ రాజులు, హేమశేఖర్, ఎంఎస్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు అపోలో ఆస్పత్రిలో ఉచిత క్యాంపు

ప్రజాశక్తి- తవణంపల్లి: మండలంలోని అరగొండ అపోలో ఆస్పత్రిలో బుధవారం ఉచిత క్యాంపు నిర్వహించనున్నట్లు అపోలో మేనేజ్‌మెంట్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ క్యాంపులో గర్భిణులకు సంబంధించి కాన్పులు, మహిళల్లో కిడ్నీ సమస్యలు, మూత్ర సేవకు సంబంధించిన అన్ని రకాల వ్యాధులకు చికిత్స చేయనున్నట్లు అపోలో మేనేజ్‌మెంట్ పేర్కొంది. మండలంలో సంబంధిత వ్యాధిగ్రస్తులందరూ చికిత్స తీసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ విజయ

ఆశా వర్కర్లకు దుస్తులు పంపిణీ చేస్తున్న డాక్టరు విజయచంద్ర

చంద్ర చేతుల మీదుగా ఆశా వర్కర్ల సమావేశం సందర్భంగా వారికి మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల నమోదు, గర్భిణులకు సేవలు, హైరిస్కు గర్భిణులకు జాగ్రత్తలు, సలహాలు, పోషకాహారం, ఆస్పత్రిలో కాన్పులు, తల్లిబిడ్డా అనుబంధ ఆహారం ప్రాముఖ్యత గురించి తెలిపారు. వడదెబ్బ నివారణ నిర్వహణకు ఆన్‌లైన్ సేవలు సేవలు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ అనురాధ, హెల్త్ ఎడ్యుకేషన్ సావిత్రి, సూపరువైజర్లు గోపి, పుష్పలత, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కలెక్టర్‌తో కలిసి వాక్ ట్రాకర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మురళిమోహన్

పూతలపట్టు అభివృద్ధికి సహకరించండి

కలెక్టర్‌కు ఎమ్మెల్యే వినతి

ప్రజాశక్తి-పూతలపట్టు: పూతలపట్టు అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ కలెక్టర్ సుమిత్ కుమార్ ను కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని పెద్ద చెరువు కట్టపై ఏర్పాటు చేస్తున్న వాక్ ట్రాకరును ఇద్దరూ కలిసి పరిశీలించారు. పూతల పట్టు చిహ్నంగా ఈ ట్రాకరును తయారు చేస్తున్నట్టు ఆయన కలెక్టరుకు వివరించారు. మండల కేంద్రంలోని డ్రైనేజీ వ్యవస్థకు, పెనుమూరు మండలానికి వెళ్లే రహదారికి లింకు రోడ్డు, బీమా నదిపై అధ్వానంగా ఉన్న వంతెన నిర్మాణం, మినీ స్టేడియం, రంగంపేట క్రాస్ లోని స్మృతి వనం వంటి అభివృద్ధి కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఇందుకు సంబంధించి కొన్ని ప్రాంతాలను కూడా పరిశీలించారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ మండల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. వారపు సంత గేటును పరిశీలించిన కలెక్టర్ రైతులు , వ్యాపారులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు చేయూత నిస్తామన్నారు. వీరి వెంట టిడిపి మండల కన్వీనర్ దొరబాబు, మండల నాయకులు మురళి నాయుడు, చంద్రమౌళి, చూడా అధికారి షణ్ముగం, మరి కొంతమంది ఉన్నారు.

అంగన్‌వాడీలకు అవగాహన

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: గంగాధర నెల్లూరు మండలం కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టుపరిధిలో మంగళవారం అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన సమావేశం నన్విర్వహించారు. ఈసందర్భంగా సిడిపివో వినత శ్రీ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యం కోసం సమతుల పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పుట్టిన బిడ్డ మొదలుకుని ఐదేళ్ల లోపు పిల్లల వరకు వయసుకు తగ్గ బరువు లేకపోవడం, బరువు ఉంటే ఎత్తుకు తగినట్లుగా ఉండకపోవడం, ఎత్తుగా ఉండే తగినంత బరువు లేకపోవడం పిల్లలు గుర్తించి ఎఎన్ఎం సహకారంతో అంగన్వాడీ టీచర్లు వైద్యసేవలు అందించాలని కోరారు. అనంతరం అంగన్‌వాడీలు, ఎఎన్‌ఎంలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ వో శ్రీనివాసులు, సూపర్ వైజర్ అనురాధ, ఎఎన్‌ఎంలు మాధవి, కుమారి, కోకిల, అమరావతి, రమాదేవి, సుజాత పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు ప్రారంభం

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్య పల్లి

పెట్రోలు బంకు ప్రారంభోత్సవానికి విచ్చేసిన హరికృష్ణ

పంచాయతీలో నయారా పెట్రోల్ బంకు నూతనంగా మంగళ వారం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమా నికి మాజీ డిప్యూటీ స్పీకర్ గుమ్మడి కుతూహలమ్మ కొడుకు, నియోజకవర్గ వైసిపి నాయకులు అనగంటి హరికృష్ణ హాజరయ్యారు. ఆయనను పెట్రోల్ బంకు యజమానులు ఉదయ్ హిమాచల్ రెడ్డి ,రామకృష్ణారెడ్డి పూలమాల వేసి , శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పేట ధనంజయ రెడ్డి, స్థానిక ఎంపీటీసీ విజయశేఖర్ రెడ్డి, ,మాజీ వైస్ ఎంపీపీ బర్డే సుబ్రహ్మణ్యం, కొమరగుంట ఎంపీటీసీ ముని చంద్ర, నేతలు భీమశంకర్ రెడ్డి, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి: ఎంపిడివో

ప్రజాశక్తి-పెద్దపంజాణి: వేసవిలో ప్రజలకు అవసరమైన తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపీడీవో బాలాజీ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం మండల అభివృద్ధి కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో బాలాజీ ఈ ఓ పి ఆర్ డి సరదా దేవి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, సచివాలయం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆధార్ సెంటర్స్ లో నాణ్యమైన సేవలు అందించాలని, ధ్రువీ కరణ పత్రాల జారీలో ఎలాంటి కాలయాపన ఉండకూడదని వారు పంచాయతీ కార్యదర్శులకు వారు సూచించారు.

అమ్మాయి ప్రేమించలేదని ప్రేమోన్మాది ఘాతుకం

గంజాయి మత్తులో స్కూటీకి నిప్పు

ప్రజాశక్తి -పుంగనూరు: ప్రేమించమని ఓ అమ్మాయి వెంటపడి వేధించడంతో, యువకుడు చెడు అలవాట్లకు బానిసయ్యాడని తెలుసుకొని తిరస్కరించడంతో యువతి ఇంటి ముందే గంజాయి మత్తులో సొంత స్కూటీకి నిప్పంటించుకున్న సంఘటన మంగళవారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన గిరి పూజగనపల్లి గ్రామంలో ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నానని వెంటపడి వేధించేవాడు.

ప్రేమోన్మాది

నిప్పంటించిన స్కూటీ

యువకునికి గంజాయి మద్యం, అలవాటుకు బానిస అయిపోయాడని ఆ అమ్మాయి ప్రేమను తిరస్కరించింది. అమ్మాయి తన ప్రేమను ఒప్పుకోవడం లేదని యువకుడు గంజాయి మత్తులో యువతి ఇంటి వద్దకు వెళ్లి గొడవ చేసి, బిగ్గరగా అరవడంతో వారు ఇంటి గడి వేసుకున్నారు. మత్తులో మరింత కోపోద్రిక్తుడై తన సొంత స్కూటీకి నిప్పంటించుకున్నాడు. ఈ సంఘటన పోలీసులకు తెలియడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని జరిగిన సంఘటనకు ఆరా తీశారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి -తవణంపల్లి: మండలంలో పుత్తూరులో గ్రామ స్థాయి బాల్య వివాహాలు, పర్యవేక్షణ కమిటీ విలేజ్ మానిటైజేషన్ ఆధ్వర్యంలో శక్తి యాప్, బాల్య కార్మికులు, సైబర్ నేరాలు, పిల్లల డ్రాప్స్ గురించి మంగళవారం అవగాహన కల్పించారు. మిషన్ వాత్సల్యకు అర్హులైన వారు ఈ పథకాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, జిపిడిపి లక్ష్యాలు, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు ఎస్ డి జి ఎస్ ఆధారంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపుత్తూరు సర్పంచ్ పియం. రవిచంద్ర రెడ్డి, పంచాయతీ సెక్రటరీ బి రామకృష్ణ, మహిళా పోలీస్ పి దివ్య, సంక్షేమ, విద్యా సహాయకులు ఎం శ్రావ్య, అంగన్‌వాడీ రోజా, సంఘమిత్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

ప్రజాశక్తి-చౌడేపల్లి: ఈనెల 10వ తేదీ చౌడేపల్లి వెలుగు కార్యాలయంలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు వెలుగు ఏపీఎం సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ సీడాఫ్ ఆధ్వర్యంలో స్థానిక వెలుగు కార్యాలయంలో జాబ్ మేళా రిజిస్ట్రేషన్ జరుగుతుందన్నారు. టెన్త్ పాస్ అయి ఉండి డిగ్రీ పూర్తి చేసిన వారు, ఐటిఐ డిప్లమా చదివిన వారు 18 నుంచి 30 సంవత్సరాలలోపు ఉన్న యువతీ యువకులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 9676180056 నెంబర్ కు ఫోన్ చేసి సంప్రదించాలని ఆయన కోరారు.

మహిళా రైతులకు అవగాహన

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: ప్రకృతి వ్యవసాయం సాగుపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి సమన్వయ ప్రణాళికపై అధికారులు మహిళా రైతులకు మంగళవారం అవగాహన నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యానికి ఉపయోగం అనే కోణంలో ఖర్చులేని విధంగా పురాతన ఎరువులు వాడకం సమావేశం నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఎక్కువగా రసాయని ఎరువులు వాడడం ద్వారా కూరగాయలు, భూమి కలుషితం అయి ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ విజయకుమారి మోడల్ మేకర్ , ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ. ఏపీవో ఎఫ్‌పిఓ ఎంటి విజయకుమారి, యుఎన్ఐటి ఇన్‌చార్జి ఐసిఆర్పిలు, సీసీలు, సంఘ మిత్రలు, జిల్లా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో రాష్ట్రం: ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-కుప్పం టౌన్ : కూటమి ప్రభుత్వ హయాంలో ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్‌ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నములు పేర్కొన్నారు. కుప్పం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మంగళవారం పట్టణ టిడిపి అధ్యక్షులు రాజ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన పాత్రికేయ సమావేశంలో ఎమ్మెల్సీ, ఏపీఎస్‌ఆర్టీసీ ఉపాధ్యక్షులు, టీటీడీ పాలకమండలి సభ్యులు శాంతారామ్, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ రాజగోపాల్, మండల టిడిపి అధ్యక్షులు ప్రేమకుమార్, రామకుప్ప మండల టిడిపి అధ్యక్షులు ఆనంద్ రెడ్డి, తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టిన అనతి కాలంలోనే రాష్ట్రం అభివృద్ధి పదంలో పయనిస్తుందని తెలిపారు.

జ్యూట్ బ్యాగులను వినియోగిద్దాం: ఎంపీ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : జ్యూట్ బ్యాగులను వినియోగించి, పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పిలుపునిచ్చారు. పేరికే ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం చిత్తూరు ఎంపీ కార్యాలయంలో పెరికే ఫౌండేషన్ అధినేత పెరికే వరప్రసాద్.. జ్యూట్ బ్యాగులను వినియోగం వల్ల కలిగే ప్రయోజనాల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

స్వామిత్వ ఇంటింటి సర్వే

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం కందూరు పంచాయతీ మిట్టపల్లి గ్రామంలో స్వామిత్వ ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి డిజిటల్ అసిస్టెంట్లు వెల్ఫేర్ అసిస్టెంట్లు ముగ్గురు, పంచాయతీ కార్యదర్శులు సర్వేయర్ మొత్తం పదిమంది టీం సభ్యులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి జయ శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ సూచనల మేరకు మిట్టపల్లి గ్రామంలోని ప్రతి ఇంటిని సర్వే చేయడం ఇంటి పక్కనున్న ఖాళీ జాగాను నమోదు చేయడం నూతనంగా గ్రామ కంఠంలో కాకుండా సెటిల్మెంట్ భూములలో కూడా నిర్మించిన ఇండ్లను సర్వే చేయడం నిర్దేశించిన నియమ నిబంధనల ప్రకారం చేస్తున్నామని తెలిపారు.

నీటి సమస్య పరిష్కారానికి ముందస్తు చర్యలు

ప్రజాశక్తి-కుప్పం టౌన్ : వేసవి ప్రారంభం కావడంతో పట్టణంలో నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేపడుతున్నట్లు పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దాము తెలిపారు. మంగళవారం పట్టణంలోని వడ్డీ చెరువు కట్ట నుండి మర్రిమాను వీధి ఎక్స్‌టెన్షన్ వరకు నూతన పైపులైను ఏర్పాటు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రజలకు నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటికే పట్టణంలో పలుచోట్ల నూతన బోరుబావులు తవ్వించడం, మరమ్మతులకు గురి అయిన బోరు మోటర్లను వినియోగంలోనికి తీసుకురావడం వంటి పనులను చేపట్టినట్టు తెలిపారు.

పారిశుధ్య పనులు ముమ్మరం

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండల కేంద్రంలోని జాతీయ రహదారికి ఇరువైపులా మంగళవారం పారిశుధ్య నిర్వహణ చేపట్టినట్టు ఎంపీడీవో బాలాజి తెలిపారు.అన్ని గ్రామ పంచాయతీలలో రోడ్డుకు ఇరువైపులా పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలను చేపట్టాలన్నారు.గ్రామ పంచాయతీ సర్పంచులు, గ్రామ కార్యదర్శి ఆధ్వర్యంలో చేపట్టనున్నట్లు పంచాయతీ విస్తరణ అధికారి శారదా దేవి తెలిపారు.

చిత్రకళలో పీఈఎస్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : 12వ అఖిల భారత బాలలు, యువత కళా పోటీ ప్రదర్శనలో భాగంగా, డ్రీమ్ యంగ్, చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో విజయవాడలో ఈనెల 5వ తేదీన నిర్వహించిన కాంపిటీషన్లో పీఈఎస్ పబ్లిక్ పాఠశాలకు చెందిన నోషిత (9వ తరగతి), ఎన్‌జే లహరి (11వ తరగతి) ఆల్ ఇండియా బాల చిత్రకళా అవార్డును సొంతం చేసుకున్నారు. భిన్న తరగతులకు సంబంధించిన విద్యార్థులు 9 మంది బంగారు పతకాలను, 11 మంది వెండి పతకాలను కైవసం చేసుకున్నారు. ఆర్ట్ మాస్టరు దినేష్ ఆలిండియా చిత్రకళా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పీఈఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ వైవికృష్ణ బాబు చిత్రకళలో ప్రతిభ చూపిన విద్యార్థులను, ఆర్ట్ మాస్టరు దినేష్‌ను అభినందించారు.

చెత్తాచెదారం తొలగింపు

ప్రజాశక్తి -రొంపిచర్ల: రొంపిచర్ల మండలం బొమ్మయ్య గారి పల్లి పంచాయతీ పజులుపేట సర్వర్ పేటలో మురికి నీటి కాలువలలో చెత్త పేరుకుపోవడం వల్ల దోమలతో ఇబ్బంది పడుతున్నామని సర్వర్ పేట లోని ప్రజలు పుంగనూరు ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించి దోమలతో అల్లాడుతున్న జనం కోసం పంచాయతీ సిబ్బందిని ఆదేశించడంతో పంచాయతీ అధికారులు మురికి నీటి కాలువలను శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, ఈవో సత్యం రెడ్డి, మహమ్మద్ అలీ పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తకు పరామర్శ

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం, (పెనుమూరు) : వెన్నెముక సమస్య అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి కార్యకర్తను ఎంపీ బుధవారం పరామర్శించారు. గంగాధర నెల్లూరు నియోజక వర్గం పరిధిలో పెనుమూరు మండలం పులికల్లు గ్రామపంచాయతీ గొడుగుమానుపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త నెల్లెపల్లి నాధముని వెన్నెముక సమస్యతో గత ఆరు నెలలుగా మంచానికి పరిమితమై కొంచెం కొంచెం ఆరోగ్యం కుదురుటపడుతూ ఇప్పుడిప్పుడే కోరుకుంటు న్నారు. స్థానిక నాయకులు కార్యకర్తలతో కలిసి ఎంపీ దగ్గుమళ్ళ

ప్రసాదరావు ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య విషయాలని అడిగి తెలుసుకున్నారు అధైర్య పడవద్దని చెప్పి మనో ధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమం లో రుద్రయ్య నాయుడు, గంధమనేని రాజశేఖర్ నాయుడు, శ్రీధర్ యాదవ్ ,కోదండ యాదవ్ ,సూరి రెడ్డి ,ప్రసాద్ యాదవ్ రమేష్ కోదండపాణి దిలీప్ కుమార్ ,పట్టాభి, రవి ,గిరి ,నరేష్, హేమాద్రి ,షణ్ముఖ వర్మ , బాలాజీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

వేము ఫలితాల ప్రభంజనం

ప్రజాశక్తి- పూతలపట్టు: పూతలపట్టు మండలం పి కొత్తకోట సమీపంలోని వేము ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు ఫలితాల ప్రభంజనం సృష్టించారని కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ కిలారి తెలిపారు. బీటెక్ లో 41 మంది ఉత్తీర్ణత సాధించగా డిప్లమాలో 14 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు. బీటెక్‌లో లక్ష్మీ ప్రియ 95 శాతం ప్రియా 94..2 శాతం మార్కులతో కళాశాల మొదటి ద్వితీయ స్థానంలో నిలిచారని తెలిపారు. డిప్లమాలో ఫరాజ్ 96.5 శాతం

మానస 95 శాతం ఉత్తీర్ణతతో ప్రథమ ద్వితీయ స్థానాల్లో నిలిచినట్టు చెప్పారు. గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో భాగంగానే కళాశాల యాజమాన్యం పనిచేస్తుందని ఆయన కొనియాడారు.

సంక్షేమానికి పెద్ద పీట: ఎంపీ

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : 'మేమిద్దరం అన్నదమ్ముల కలిసి నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తాం..' అని ప్రజల సంక్షేమానికి కూటమీ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్ రావు, ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ పురం మండలంలోని మంగుంట గ్రామ పంచాయతీ లోని మంగుంట గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎంపీ ,ఎమ్మెల్యే కలసి ప్రారంభించారు. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎస్ఆర్ పురం మండలం మంగుంట గ్రామంలో 28 లక్షల ఎంపీ నిధులతో చేసిన పలు అభివృద్ధి చేశారు. ఈ సందర్భంగా మీడియా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజల సంక్షేమానికి కూటమీ ప్రభుత్వం వెనుకడదని ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. త్వరలో నియోజకవర్గంలో రెండు వేల ఎకరాల్లో పరిశ్రమలు నెలకొల్పుతామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు జయశంకర్ నాయుడు, రాజశేఖర్ నాయుడు, జీవన్ రెడ్డి, చంద్రారెడ్డి, బాలాజీ నాయుడు, ఎంపీడీవో మోహన్ మురళి, తాసిల్దార్ లోకనాథం పిళ్ళై,ఏపీవో లలిత, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు గుండయ్య, జిల్లా కార్యదర్శి కోదండ యాదవ్, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్, రిటైర్డ్ ఎస్పీ పిసి స్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికల గురుకుల పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని బంగారెడ్డిపల్లి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలను మంగళవారంఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్ రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గురుకుల పాఠశాల పరిశీలించి విద్యార్థినీలు పలు సూచనలు చేశారు. పాఠశాల విద్యార్థినీలు వారి సమస్యలను, విద్యా బోధనకు సంబంధించిన కొన్ని అంశాలను అడిగి తెలుసుకున్నారు విద్యా బోధనపై టీచర్లతో ముఖాముఖి మాట్లాడారు. పాఠశాల ప్రిన్సిపాల్ దమయంతి, టీచర్లు పాఠశాలకు కావలసిన కొన్ని హామీ అడగ్గా వెంటనే ప్రిన్సిపాల్ హామీ మేరకు ఎంపీ పాఠశాలకు కావలసిన ఆర్వో ప్లాంట్, బస్సు షెల్టర్ కట్టిస్తానని ఎంపీ సానుకూలంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, టిడిపి జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, రాజశేఖర్ నాయుడు, పాలసముద్రం మాజీ ఎంపీపీ ఇందిరమ్మ, మురుగేష్ గురుకుల పాఠశాల టీచర్లు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్:

సదుం మండల పరిధిలోని గొంగి వారి పల్లి రెవెన్యూ పరిధిలోని నీళ్లు లేని సూరప్పకుంట లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం మంగళవారం వెలుగులోకి వచ్చింది. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో పశువులు కాపర్లు సదుం పోలీసుల కథనం మేరకు..సదుం - పుంగనూరు రోడ్డు బాలాజీ రైస్ మిల్లుకు దగ్గరలోని సూరప్ప కుంటలో ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి వుందని గొంగివారిపల్లెకు చెందిన పశువుల కాపర్లు సదుం పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడు 45 - 50 సంవత్సరాల మధ్య వయసు కలిగి, బ్లాక్ అండ్ వైట్ గళ్ళ చొక్కా, బ్లూ లుంగీ ధరించి ఉన్నాడు. మృతుడి బాడీ కింద మద్యం బాటల్ వుంది. సోమవారం రాత్రి, లేదా మంగళవారం ఉదయం గాని గుర్తు తెలియని వ్యక్తి సూరప్పకుంటలో పడి మరణించి ఉంటాడని సదుం పోలీసుల నుండి సమాచారం. సదుం పోలీసులు కేసు నమోదు చేసుకొని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సదుం పోలీసులు మంగళవారం విలేకరులకు తెలిపారు. గుర్తు తెలియని మృతుడి వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని వారు తెలిపారు.

104 వైద్య సేవలు

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం ఇరికిపెంట సబ్ సెంటర్ వద్ద మంగళవారం 104 వాహనం ద్వారా వైద్య సేవలను ప్రజలకు వైద్య సిబ్బంది వైద్యాధికారులు అందించారు. వైద్యాధికారి ప్రదీప్ కుమార్ రెడ్డి రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అధికంగా త్రాగునీరు స్వీకరించాలని ఎండకు ఎక్కువ తిరగకుండా జాగ్రత్త వహించాలని వడదెబ్బ సోకిన వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించి తగిన వైద్యం చేయించుకోవాలని సూచించారు.

100 మందికి వైద్య సేవలు అందించి బీపీ షుగర్ ఇతర పరీక్షలను చేసి మందులు మాత్రలు పంపిణీ చేసినట్టు ఏఎన్ఎం మదనిక తెలిపారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు గుణవతి, శ్రీలత, నాగరత్న 104 సిబ్బంది పాల్గొన్నారు.

మా మధ్య ఎలాంటి విభేదాలు లేవు: విఎం థామస్

ప్రజాశక్తి -వెదురుకుప్పం:

మండలంలో ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మంగళవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక తెలుగు తమ్ముళ్లు ఏర్పాటు చేశారు. ఆ పార్టీ మండల అధ్యక్షులు కామసాని లోకనాథ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే థామస్

ఎంపి, ఎమ్మెల్యేను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

హాజరయ్యారు. అతిథిగా చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంపీకి తనకు ఎలాంటి విభేదాలు లేవని, ఇద్దరం కృష్ణ అర్జున లాంటి వారమని. ఇద్దరం నియోజకవర్గ అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేస్తు న్నామని చెప్పారు. గడిచిన ఈ తొమ్మిది నెలలలో నియోజక వర్గానికి అభివృద్ధి కోసం 50 కోట్లు ఎంపీ నిధులు విడుదల కాగా, ఇందులో 15 కోట్లు ఎంపీ నిధుల నుంచి అభివృద్ధి కార్యక్రమాలు జరిగినట్లు ఆయన స్పష్టం చేశారు. ఇద్దరం వృత్తిరీత్యా ఉన్నత స్థాయిలో సేవాభావంతో పనిచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సభ్యత్వ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - గుడిపల్లి: గుడిపల్లి మండలం టిడిపి కార్యాలయంలో మంగళవారం సభ్యత్వ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా గతంలో నూరు రూపాయలు చెల్లించి టిడిపి సభ్యత్వం పొందిన ప్రతి వ్యక్తికి సభ్యత్వ కార్డులు మంజూరు చేసి వారికి అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు టీఎం బాబు నాయుడు మాట్లాడుతూ..సభ్యత్వం తీసుకున్న ప్రతి వ్యక్తికి ప్రమాదవశాత్తు మరణించిన వ్యక్తికి ఐదు లక్షల రూపాయలు ప్రమాద బీమా లభిస్తుందని

సభ్యత్వ కార్డులు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

ఆయన తెలిపారు. ఈ కార్డులను ప్రతి బూత్‌లో పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం లో మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ఆర్ చంద్రశేఖర్, క్లస్టర్ ఇన్‌ఛార్జి హేమంబాగౌడ్, ఏసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు సుబ్రమణి, యూనిట్ ఇన్‌ఛార్జి గోవిందస్వామి, నియోజకవర్గ యువ త అధ్యక్షుడు వెంకటేష్, చీకటి పల్లి పార్టీ అధ్యక్షుడు విజయ కుమార్, రామయ్య, యూనిట్ ఇన్‌ఛార్జి ప్రకాష్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -సోమల: విద్యుత్ శాఖ వారు గృహ విద్యుత్ వినియోగదారుల సౌల భ్యం కోసం ఆదనపులోడుకు ఇదివరకు చెల్లించాల్సిన అమౌంట్ కంటే తగ్గింపు డబ్బు కట్టి అదనపులోడును పొందే విధంగా అవకాశం కల్పించిందని ఏప్రిల్ నెలలోపు ఈ అవకాశాన్ని గృహ వినియోగ దారులు సద్వినియోగం చేసుకోవాలని సోమల ట్రాన్స్‌కో మహేందర్ రెడ్డి తెలిపారు.

క్రైం న్యూస్

బంగారం దోపిడీ కేసులో మరో ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి -వి కోట : ఇటీవల జిల్లాలో సంచలనం సృష్టించిన బంగారం దారి దోపిడీ కేసులో మరో ఐదుగురు నిందితులను అరెస్టు చేసి నట్లు పలమనేరు డిఎస్‌పి డేగల ప్రభాకర్ తెలిపారు. వీకోట పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని నాయకనేరి అటవీ ప్రాంతంలో ని ఆంజనేయ స్వామి గుడి సమీపంలో జాతీయ రహదారిపై ఈనెల 2వ తేదీ రాత్రి కారును అడ్డగించి, అందులోని వ్యక్తులను బెదిరించి 3.5 కేజీల బంగారాన్ని దుండగులు దోచుకెళ్లారని, ఈ కేసు విచారణలో భాగంగా కర్ణాటక కేజీఎఫ్‌కు చెందిన కౌన్సిలర్ జయపాల్‌తో పాటు మరో ఐదుగురిని 5 వ తేదీ అరెస్టు చేసి వారి వద్ద నుండి 3.5 కేజీల బంగారు బిస్కెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. మొత్తం ఈ కేసులో 14 మంది నిందితులు పాల్గొన్నట్లు వారు తెలిపారు. ఇందులో భాగంగా రెండు రోజుల క్రితం వి కోట - పర్నంబట్ జాతీయ రహదారిలోని శ్రీ ఆంజనేయ స్వామి గుడి వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న తమిళనాడుకు చెందిన వేదాచలం , కుమారస్వామి , రంజిత్ , దీపన్ చక్రవర్తి విజయన్, సూరవేల్‌లను వి కోట సిఐ సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు విచారించి అరెస్ట్ చేసినట్లు వారు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించామని వారు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి మిగిలిన నలుగురు నిందితులను త్వరలో అరెస్టు చేస్తామని వారు తెలిపారు.

అవమానభారంతో ఆత్మహత్య

వి కోట మండలం నాయకనేరి అటవీ ప్రాంతంలో వారం రోజుల క్రితం చోటు చేసు కున్న బంగారం దారి దోపిడీ కేసులో ఎనిమిదో నిందితుడిగా ఉన్న వ్యక్తి తమిళనాడు లో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. పేర్నంబట్ సమీపంలోని కొండపల్లి కి చెందిన జైపాల్ కుమారుడు అప్పు తమ స్నేహితులు బలవంతంగా తనను తీసుకెళ్లి ఈ కేసులో

ఆత్మహత్యకు పాల్పడ్డ నిందితుడు అప్పు

ఇరికించారని వారి వల్లే తను ఆత్మహత్యకు పాల్పడుతున్నానంటూ మనస్తాపంతో వీడియో విడుదల చేశాడు. గ్రామ సమీపంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ విషయం పై స్థానిక పోలీసులను వివరణ కోరగా తమకు సమాచారం లేదని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి -విజయపురం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడిన సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. జంబాడ ఎస్టీ కాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం ద్విచక్ర వాహనంలో కనకమ్మ సత్రంకు వెళుతుండగా ఎదురుగా లారీ రావడంతో పక్కకు తప్పుకోవడానికి ప్రయత్నం చేయగా రోడ్డు పక్కన మట్టి తవ్వడంతో దానిపై పడి గాయపడ్డాడు. 108 కు సమాచారం అందించడంతో నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించిందని వైద్యులు తిరుపతి స్విమ్స్‌కు తరలించారు.

భార్యపై యాసిడ్ పోసిన భర్త అరెస్ట్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:. భార్య కాపురానికి రాలేదనే కోపంతో భార్యపై యాసిడ్ పోసిన భర్తను అరెస్టు చేసినట్లు రెండవ పట్టణ సీఐ నెట్టి కంటయ్య తెలిపారు. మంగళవారం స్థానిక రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ నెట్టి కంటయ్య మాట్లాడుతూ రాంనగర్ కాలనీకి చెందిన భార్యాభర్తలు దావూద్, రేష్మా రెండు నెలల క్రితం మనస్పర్ధలు రావడంతో విడిపోయారు. రేష్మ రాంనగర్ కాలనీ లోని ఇంట్లో ఉంటుండగా సోమవారం రాత్రి ఆమె ఇంటికి వెళ్లి కాపురానికి రమ్మని దావూద్ కోరాడని, ఆమె నిరాకరించి తలుపు మూసుకుంది. తలుపు తీయమని గట్టిగా అరవడంతో ఆమె భయంతో తలుపు తీయగా, తన వెంట తెచ్చుకున్న బ్యాటరీల్లో వినియోగించే యాసిడ్‌ను ఆమె ముఖంపై పోశాడని, ఆమె గట్టిగా అరవడంతో దావూద్ పారిపోయాడని రేష్మ బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దావూద్‌ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: వ్యానును ద్విచక్రవాహన దారుడు ఢీకొన్న ప్రమాదంలో స్కూటరిస్టు మృతి చెందిన సంఘటన సదుం మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. సోమల మండలం పెద్ద ఉప్పరపల్లి కి చెందిన అశోక లైలాండ్ మినీ టెంపో వాహనంలో కొబ్బరి బొండాల లోడు తో వెళ్తున్న వాహనాన్ని మంగళవారం మధ్యాహ్నం సుమారు నాలుగున్నర గంటల ప్రాంతంలో, కల్లూరు నుండి సదుం వైపు ద్విచక్ర వాహనంలో వస్తున్న వ్యక్తి ఢీకొన్నాడు. తన ద్విచక్ర వాహనంతో మినీ టెంపోను ఢీకొని అక్కడకక్కడే మృతి చెందాడు. ఇతను బంగారు పాలెం మండలం పరిధిలోని తుమ్మపాలెం కు చెందిన యోగరాజు అనే వ్యక్తి అని తెలిసింది. సదుం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్సీకి గ్రామస్తుల కృతజ్ఞతలు

ప్రజాశక్తి-కుప్పం రూరల్ : కూసూరు గ్రామ పరిధిలో సిసి రోడ్డు ఏర్పాటుకు సహకరించిన ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్‌కు కూసూరు టిడిపి నాయకులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుప్పం నుంచి మొట్లచేను ప్రధాన రహదారిలో తమ గ్రామం ఉంటుందని తెలిపారు. గ్రామాభివృద్ధి లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సి సి రోడ్డు నిర్మాణానికి ఉత్తర్వులు జారీ చేశారని, ఇందులో భాగంగా తమ గ్రామ పరిధిలో 90 మీటర్లు సీసీ రోడ్డు నిర్మాణం చేయవలసి ఉందన్నారు. అయితే తమ గ్రామ పరిధిలో వెలిసిన సుబ్రహ్మణ్య స్వామి దేవాలయం వరకు రోడ్డు నిర్మాణం పొడిగించాలని ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారని తెలిపారు.

IN THE COURT OF 1 ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) OF CHITTOOR
E.P.No.11 of 2020
O.S.No. 53 of 2015

Between
K.Purushotham ...Decree-holder
And
A.B.Subbaramaraju ...Judgment-debtor

NOTICE UNDER RULE 22 of CPC. TO THE JUDGMENT-DEBTOR

To
A.B. Subbarama Raju,
So late A.B. Subba Raju
D No 1-60. G.D Nellore Village & Mandal,
Chittoor District
Sir.
Please take notice that the above named decree-holder filed the above E.P. as against you for recovery of EP amount by way of attachment and sale of EP schedule mentioned property and the above EP is posted to **28-04-2025** for your appearance before the said court Please be present either in person or through an advocate on the said date at about **10-30 A.M**. and to raise your objections if any, failing which the matter will be decided as exparte in your absence.

Sd/-**N.SARAVANA KUMAR**
Advocate for Decree-holder

CHITTOOR URBAN DEVELOPMENT AUTHORITY, CHITTOOR

Roc No: 108/2022/CHUDA Dated: 08.04.2025.

E-Procurement Tender Notice

Tenders are invited from eligible contractors for 1 No. work under CHUDA Funds 2024-25 for worth of Rs. 38.90 Lakhs on e-procurement by under signed.

SL.No	Bid down loading starting date and Time	Last date & time for receipt of Bids
1	09.04.2025 @ 6.00PM	28.04.2025 @ up to 3.00PM

For Further full details contact at 7780661666 during the office hours on all working days.

Sd/- **G.VIDYADHARI**, I.A.S.,
Vice Chairperson, CHUDA